

ఇన్‌చార్జిలను మార్చినా

జోష్ లేదు

- చాపకింద నీరులా అసమ్మతి లేపేందుకు యత్నాలు
- కాకినాడ సీఎం పర్యటనకు పి.గన్నవరం ఎమ్మెల్యే దూరం
- పి.గన్నవరం ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాల్ వ్యవహార శైలిపై పెదవి విరుస్తున్న కేడర్
- టీడీపీ కంచుకోటను బద్దలుకొట్టేందుకే తనను బదిలీ చేశారంటున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- మంత్రి విశ్వరూప్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన జగన్?
- ఇదీ వైసీపీలో జిల్లా తాజా రాజకీయ ముఖ చిత్రం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రెండు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ ఇన్‌చార్జులను మారుస్తూ ఆ పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కేడర్‌లో జోష్ నింపలేదు. అంతర్గత విబేధాలు బహిర్గతమవుతున్నాయి. పి.గన్నవరం ఇన్‌చార్జిగా కొండేటి చిట్టిబాబు స్థానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అయితే కేడర్‌లో పెద్దగా స్పందన కనిపించలేదు. సరికదా వేణుగోపాల్ వ్యవహార శైలిపై నియోజకవర్గ ఓటర్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇన్‌చార్జి మార్పుతో మనస్తాపానికి గురైన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం నగరంలోని ఇంటికే పరిమితమయ్యారు. బయటి వ్యక్తులను కలుసుకునేందుకు నిరాకరించినట్టు సమాచారం. కాకినాడలో ముఖ్యమంత్రి కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. పార్టీలో ఉండాలా! వీడాలా! అనే దానిపై చిట్టిబాబు వర్గీయులు తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. అయితే బుధవారం అయినవిల్లి మండలంలో ముందుగా నిర్ణయించిన ప్రకారం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే చిట్టిబాబు పాల్గొనాల్సి ఉన్నప్పటికీ సీటు గల్లంతు కావడంతో అవమానభారం భరించలేక ఇంటికే పరిమితమైనట్టు సమాచారం. పార్టీ పెద్దలెవరైనా మధ్య వర్తిత్వం నడుపుతారనే భావనతో ఆయన వర్గీయులు ఎదురు చూస్తున్నారు.

బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ను ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నుంచి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి బదిలీ చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్‌ను రామచంద్ర పురం ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయన వర్గీయులు హసన్‌బాదలోని ఆయన ఇంటికి వెళ్లి సంబరాలు చేసుకుంటున్నారు. మంత్రి వేణు మాత్రం టీడీపీ కంచుకోటగా ఉన్న రాజమహేంద్రవరం రూరల్ స్థానంలో వైసీపీ జెండా ఎగరవేయగల సత్తా తనకే ఉందని భావించిన వైసీపీ అధిష్ఠానం అక్కడకు పంపించిందని గర్వంగా చెప్పుకుంటున్నారు. అయితే ఇప్పటివరకు మంత్రి వేణు వెన్నంటు ఉండి ఎన్నో వ్యవహారాలు చక్కబెట్టిన ఆయన వర్గీయులు బోస్ వర్గంలో ఇమడగలరా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో వేణు వర్గంలో కొందరు పార్టీని వీడి మరో పార్టీలో చేరితే బావుంటుందనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. ఇక వైరి వర్గాలుగా ఉండే ఎంపీ బోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వర్గీయులు సూర్యప్రకాష్‌ను రామచంద్రపురం నుంచి గెలిపించే బాధ్యతలో ఐక్యతారాగం ఆలపిస్తారా లేక అసమ్మతి రాగం తీస్తారా అనేది రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇక మంత్రి వేణు, ఎంపీ బోస్ కాకినాడలో జరిగిన సీఎం పర్యటనలో ఎడమొహం పెడమొహంగానే వ్యవహరించారు.

కాగా ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సీఎం జగన్‌ను కలిసినప్పుడు కొందరికి పలు సూచనలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో భాగంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను తిరిగి అమలాపురం నుంచే పోటీ చేయాల్సిందిగా జగన్ ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దాంతో పక్కనే ఉన్న అతని కుమారుడు శ్రీకాంత్ చిన్నబుచ్చుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద అమలాపురం స్థానానికి మంత్రి, సిటింగ్ ఎమ్మెల్యే విశ్వరూప్ పేరు ఖరారు చేయడంతో ఇక్కడ ఆశలు పెంచుకున్న ఎంపీ చింతా అనురాధకు మాత్రం ఏకైక ఆప్షన్ రాజోలు అసెంబ్లీ స్థానం మాత్రమే. ఆమెను తిరిగి ఎంపీకి పంపిస్తారా లేదా రాజోలు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటిస్తారా లేదా పక్కన పెడతారా అనేది ఆ పార్టీ వర్గీయుల్లో చర్చనీయాంశంగా మారింది. పాయకరావుపేట నియోజకవర్గానికి అనురాధ వెళతారని కొంత ప్రచారం జరిగినప్పటికీ అక్కడ స్థానానికి ఇన్‌చార్జిని నియమించడంతో ఆమె ఆశలు ఆ స్థానంపై సన్నగిల్లాయి. మొత్తంమీద వైసీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పులు, చేర్పులు వ్యవహారం పార్టీ వర్గీయుల్లో వారి ఊహలకు తగినట్టుగా లేకపోవడంతో నిరుత్సాహం అలుముకుంది.




అమలాపురంలో కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ ఐవీ రావు (ఇన్‌సెట్‌లో)

కదంతొక్కారు

- కలెక్టరేట్ ఎదుట మెయిన్‌రోడ్డుపై బైఠాయించి అంగన్‌వాడీల నిరసన
- సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో 12 గంటల నిరసన దీక్ష
- డిమాండ్ల పరిష్కారారినికి నినదించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు

అమలాపురం, జనవరి 3 (అమలాపురం): అదిలిస్తే అదిరిపోం.. బెదిరిస్తే బెదిరిపోం.. అంటూ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది అంగన్‌వాడీలు అమలాపురం కలెక్టరేట్ ఎదుట బుధవారం కదంతొక్కారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ప్రధాన రహదారికి ఇరువైపులా అంగన్‌వాడీలు బైఠాయించి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో భాగంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. 23 రోజులుగా అంగన్‌వాడీలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిరవధిక సమ్మెలో ఉంటే ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని విమర్శించారు. తెలంగాణ కంటే మిన్నగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన జగన్ ఇంతవరకు ఆ హామీని అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలని డిమాండు చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఈ నెల 5న అంగన్‌వాడీలు విధుల్లో చేరకపోతే చర్యలు తప్పవని అధికారులు జారీ చేసిన సర్క్యులర్ నకళ్లను కలెక్టరేట్ ఎదుట నాయకులతో పాటు అంగన్‌వాడీల సంఘ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి వెంకటలక్ష్మి, కె.కృష్ణవేణి, ప్రాజెక్టు నాయకురాళ్లు కె.బేబీగంగారత్నం, పి.అమూల్య ఆధ్వర్యంలో దహనం చేశారు. సమ్మె శిబిరాన్నుద్దేశించి సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్‌లతో పాటు వివిధ ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలు సమ్మె శిబిరంలోనే మధ్యాహ్న భోజనాలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా వేలాది మంది అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట అమలాపురం-ముక్తేశ్వరం మెయిన్‌రోడ్డుపై బైఠాయించి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ నాయకులు దుర్గమ్మ, విజయలక్ష్మి, పి.వెంకటలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, సుజాత, రాణి తదితరులు పాల్గొన్నారు.




యూటీఎఫ్ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ రావు

నీ పాలనా కాలపు ఆర్థిక బకాయిలు.. వచ్చే ప్రభుత్వం మీదకు నెట్టేస్తారా

ఎమ్మెల్సీ ఐవీ సూటి ప్రశ్న

అమలాపురం టౌన్, జనవరి 3: మీ పాలనా కాలంలో చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను రాబోయే ప్రభుత్వం మీదకు నెట్టేస్తారా అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) జగన్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. 11 డీఏలు చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు ఒక్క డీఏ కూడా చెల్లించలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిపడ్డ రూ.1,896 కోట్లు ఈ రెండు నెలల పాలనలో చెల్లిస్తారా అని ప్రశ్నించారు. బకాయిల చెల్లింపులకై యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట 12 గంటల పాటు నిరవధిక ధర్నా చేపట్టారు. ఉదయం 9 గంటలకు ధర్నా శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా సీఎం జగన్ సీపీఎస్ రద్దుచేసి మెరుగైన పీఆర్సీ ఇస్తానని ఉద్యోగ, ఉపాధ్యాయులను నమ్మించి మోసగించారని విమర్శించారు. కనీసం 12వ పీఆర్సీ అమలుకు కూడా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రకటించిన డిమాండ్లు నెరవేర్చకపోతే మూడో దశ పోరాటంలో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో 36 గంటల పాటు నిరంతర ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి ధర్నా శిబిరంలో మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు, సమగ్ర శిక్షా ఉద్యోగులు ధర్నా శిబిరాన్ని సందర్శించి వందలాది మంది సంఘీభావం తెలిపారు. ధర్నా శిబిరం వద్ద నిర్వహించిన వంటా-వార్పులో ఎమ్మెల్సీ ఐవీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. రాత్రి 9 గంటల వరకు ధర్నా కొనసాగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు చంద్రకళ, నల్లి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా

అమలాపురం టౌన్, జనవరి 3: సమగ్ర శిక్షాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనంచేసి రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండుతో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది ఉద్యోగులు అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో ఫుట్‌పాత్‌పైనే బైఠాయించి ప్రభుత్వ తీరుకు నిరసన తెలిపారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పార్టుటైమ్ విధానాన్ని రద్దు చేసి ఫుల్‌టైమ్ ఒకేషనల్ టీచర్లుగా మార్పుచేసి వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్, గ్రాట్యుటీ రూ.10లక్షలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలు కల్పించాలని నినాదాలతో హోరెత్తించారు. ధర్నా శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. శిబిరంలో అసోసియేషన్ జిల్లా జేఏసీ నాయకులు ఎస్.వెంకట్, ఎం.శ్రీను, ఎం.వెంకటేశ్వరరావు, షేక్ రెహ్మాన్, గూటం నాగన్న, త్రినాథ్, నాగమల్లేశ్వరరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా శిబిరం నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులకు సంఘీభావం తెలిపారు. కలెక్టరేట్ వద్దకు వేలాదిగా తరలివచ్చి ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బద్రి జాన్‌బాబు, బుంగ కిశోర్, రంప రవికిశోర్, బి.కిశోర్, కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, ఆర్.రమాదేవి, మెండు అర్జున్, బసవేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పెన్షన్ చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జిల్లాలో 2.48 లక్షల మందికి అదనంగా

రూ.5.92 కోట్ల లబ్ధి

అమలాపురం టౌన్, జనవరి 3: జిల్లాలో 2,48,514 మంది పెన్షన్ లబ్ధిదారులకు ఈ నెల నుంచి రూ.3వేలు పెన్షన్ అందజేస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. వీరికి పెంచిన పెన్షన్ మొత్తంతో అదనంగా రూ.5.92 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. కలెక్టరేట్‌లో వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.72,38,64,000 చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వీకే రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, ఏపీడీ ఎంఎం జిలానీ, డీపీఎం విజయకుమార్, కృష్ణవేణి, డీపీఎల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 22 తర్వాత ఓటరుగా నమోదు చేసుకున్నా...

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయవచ్చు

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్, జనవరి 3: ఈ నెల 22 తర్వాత ఓటరుగా నమోదు చేసుకున్న వారికి సప్లిమెంటరీ ఓటరు జాబితా వస్తుందని, వారు కూడా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాను ఇప్పటికే విడుదల చేశామని, అభ్యంతరాలను పరిశీలించామన్నారు. ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణకు సర్వసన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,644 పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులు, లైట్లు వంటి కనీస వసతులు ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అల్లాడి స్వామినాయుడు (టీడీపీ), షేక్ అబ్దుల్ ఖాదర్ (వైసీపీ), కామన ప్రభాకరరావు, వడ్డి నాగేశ్వరరావు (కాంగ్రెస్), దూరి రాజేష్ (బీజేపీ), కారెం వెంకటేశ్వరరావు (సీపీఎం) పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం



ప్రయాణికులతో రద్దీగా ఉన్న రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్

హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులపైనే ప్రధాన దృష్టి

స్పెషల్ బస్సులు 68, షెడ్యూల్ బస్సులు 11

10వ తేదీ నుంచి 'హైదరాబాద్ ఆపరేషన్' ప్రారంభం

స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ రూట్లలోనూ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధానంగా, హైదరాబాద్ నుంచి వచ్చే పండగ ప్రయాణికులపైనే జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటి వరకూ నిర్ణయించిన ప్రకారం ఈనెల 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు మొత్తం 79 సర్వీసులు నడుపుతారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు నాలుగు డిపోల నుంచి 68 స్పెషల్ సర్వీసులు హైదరాబాద్‌కు నడుపుతారు. రాజమహేంద్రవరం డిపో నుంచి 42, గోకవరం డిపో నుంచి 16, నిడదవోలు డిపో నుంచి 3, కొవ్వూరు డిపో నుంచి 7 స్పెషల్ బస్సులు నడపనున్నారు. ఈ స్పెషల్స్‌కు అదనంగా రెగ్యులర్‌గా వెళ్లే మరో 11 షెడ్యూలు బస్సులు నడుస్తాయి. ఇలా మొత్తం 79 సర్వీసులను హైదరాబాద్‌కు తిప్పడానికి చర్యలు చేపట్టారు. పెద్ద పండుగ ముగించుకుని తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం కూడా స్పెషల్ బస్సులు నడపాలని భావిస్తున్నా ముందుగా హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులు టార్గెట్‌గా స్పెషల్ బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, విజయవాడ, విశాఖపట్నం రూట్లలోనూ స్పెషల్ బస్సులు నడపాలని అధికారులు యోచిస్తున్నారు. పండక్కి ఒకటి, రెండు రోజుల ముందు నుంచి ఈ రెండు రూట్లలో స్పెషల్ సర్వీసులు నడిపితే చాలనే అభిప్రాయం ఉంది.

రష్ బాగుంది.. టిక్కెట్లున్నాయి ...

పెద్ద పండుగ రోజుల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులు భారీ సంఖ్యలో ఉంటారు. దీంతో సాధారణంగా ప్రతి ఏటా ఆర్టీసీ సర్వీసులకు మంచి ఆదరణ ఉంటుంది. దీనికితోడు ఈ ఏడాది స్పెషల్ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేయడంతో ఆర్టీసీ బస్సులకు మంచి డిమాండ్ నెలకొంది. ప్రస్తుతం ముందస్తు రిజర్వేషన్లు జోరుగా జరుగుతున్నాయి. రష్ బాగుందని, అయితే టిక్కెట్లు దొరకని పరిస్థితి లేదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే అన్ని బస్సుల్లోనూ దాదాపు 70 శాతానికి పైగా రిజర్వేషన్లు పూర్తయ్యాయని, ఇంకా టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

అవసరమైతే మరిన్ని స్పెషల్ బస్సులు:

ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళా అశోక



పెద్ద పండుగ సందర్భంగా జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నాం అని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళా అశోక తెలిపారు. స్పెషల్ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తామన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం అదనంగా స్పెషల్ సర్వీసులు పెంచామన్నారు. పండగ ముందు 68 స్పెషల్స్ ఒక్క హైదరాబాద్‌కు పంపుతున్నామని తెలిపారు. పండుగ తర్వాత మరిన్ని స్పెషల్స్ ఉంటాయన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి స్పెషల్ సర్వీసులు మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

దేశ ప్రగతికి మత్స్య సంపద దోహదం

కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల



మినీ ఫిషింగ్ హార్బరులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం

అంతర్వేది, జనవరి 3: మత్స్య సంపద దేశ ప్రగతికి దోహద పడుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో ఏర్పాటు చేసిన సాగర్ పరిక్రమ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ఉభయ గోదావరి జిల్లాలు, కోనసీమ జిల్లాలో స్వచ్ఛందంగా మత్స్యకారులను కలుస్తానని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. మోదీ హయాంలోనే కేంద్రంలో మత్స్యశాఖను గుర్తించి మంత్రి పదవితో పాటు మత్స్యకార అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో 382 కేసీసీ కార్డులు పంపిణీ చేసినట్టు తెలిపారు. సుమారు కోటి 16 లక్షల మత్స్యకారులు లబ్ధి పొందారన్నారు. మత్స్యకార, ట్రేడర్ అసోసియేషన్ వంటి మత్స్యకార విభాగాలపై కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగా రూ.20 లక్షలతో మోటూరి సూర్యకిరణ్‌కు ట్రేడర్ వెహికల్ సబ్సిడీతో అందించారు. రూ.32 కోట్లతో మినీ హార్బరు నిర్మించి తీర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి కల్పనతో పాటు మత్స్యసంపద వివిధ దేశాలకు తరలి వెళుతుందన్నారు. సమావేశం అనంతరం పలువురు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుఫూర్‌అజయ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫిషరీస్ జాయింట్ సెక్రటరీ నీతూకుమారిప్రసాద్, ఎన్ఎఫ్‌డీబీ సీఈవో ఎల్ఎం మూర్తి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, ఫిషరీష్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జేడీ ఆనందరావు, ఏడీ వర్ధన్, ఎఫ్‌డీవో వెంకటరమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు.

ఆలయంలో కేంద్ర మంత్రి పురుషోత్తం పూజలు

అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మత్స్య, పశుసంవర్ధకశాఖ కేంద్ర మంత్రి రూపాల పురుషోత్తం బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం ఆలయ ఏసీ వి.సత్యనారాయణ కేంద్ర మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నీతూకుమారిప్రసాద్, ఓఎస్డీ తివారీ, ధార్మిక పరిషత్ మెంబర్ విశ్వనాథరాజు, ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



తుని రూరల్, జనవరి 3: 10వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకుని తేటగుంట శివారు రాజుల కొత్తూరులో ఓ మహిళ అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందజేశారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు ఎస్ఐ విజయ్‌బాబు తెలిపారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని, సంబంధించిన వారు ఉంటే తుని రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



తుని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీ కొని వృద్ధురాలు మృతి చెందింది. గొల్లపోలు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 50 ఏళ్ల వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలతో పడి ఉంది. దీంతో రైల్వేస్టాఫ్ కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్య చికిత్స అందించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు మరణించినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. వివరాలు తెలియరాలేదని, ఆమెకు సంబంధించిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

జనం లేక జగన్ సభ వెలవెల

కాకినాడలో సీఎం జగన్ సామాజిక పింఛన్ల పెంపు సభ

సీఎం ప్రసంగం సమయంలోనే వెళ్లిపోయిన జనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి): కాకినాడలో బుధవారం సీఎం జగన్ సభ జనం లేక వెలవెల బోయింది. సభకు వచ్చినవారంతా మధ్యలోనే వెళ్లిపోవడంతో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో జనాన్ని తరలించినా సామాజిక పింఛన్ల పెంపు సభా ప్రాంగణానికి బస్సులు, ఆటోల్లో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి అధికారులు తరలించారు. ఉదయం 6 గంటలకే జనాన్ని లోపల కూర్చోబెట్టారు. తీరా మధ్యాహ్నం 12గంటలకు సీఎం జగన్ సభకు వచ్చారు. రూ.3 వేల సామాజిక పింఛన్లకు సంబంధించి రూ.1,968 కోట్ల నిధులను విడుదల చేసిన తర్వాత 12.30కు జగన్ ప్రసంగించారు. ఈ సమయంలో ఒక్కసారిగా అందరూ లేచి వెళ్లిపోయారు. పోలీసులు, అధికారులు అడ్డంగా నిలబడి జనాలను నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ ఎవరూ ఆగలేదు. నెట్టుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కొందరైతే బారికేడ్లు దూకేసి జంపయిపోయారు. జనం వెళ్లిపోవడంతో కంగుతిన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి తన మనుషులతో వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. బయటకు వెళ్లేదారులను మూసేశారు. అయినా ఎవరూ వినిపించుకోలేదు. దీంతో సీఎం జగన్ ఒకపక్క ప్రసంగిస్తుండగానే సభలో కుర్చీలన్నీ ఖాళీ అయిపోయాయి.



సభ నుంచి వెనక్కి వెళ్లిపోతున్న జనం

నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

చింతూరు, జనవరి 3 : ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినుల్లో ఇంకా 38 మంది ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. చింతూరు మండలం, బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 43 మంది విద్యార్థినులు మంగళవారం ఫుడ్ పాయిజన్‌కు గురైన విషయం విదితమే. దీంతో వారందరికి చికిత్స అందించే క్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో కోలుకున్న ఐదుగురు విద్యార్థులను బుధవారం డిశ్చార్జి చేశారు. ఇంకా 38 మంది విద్యార్థినులు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వారిలో మరో ఐదుగురుని కూడా డిశ్చార్జి చేస్తామని, మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన అవసరం లేదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు ఆయన తెలిపారు. కూరగా వండిన చికెన్ లేదా, సరిగా ఉడకని అన్నం కారణంగా ఈ సమస్య తలెత్తి ఉండవచ్చన్న ప్రాథమిక అభిప్రాయానికి వైద్యులు వచ్చినట్లు డా.పుల్లయ్య పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్‌రాజు బుధవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకూడదని ఆయన అక్కడి ఉపాధ్యాయులను హెచ్చరించారు.

నేటి నుంచి గైట్‌లో చతుర్వేద మహాయాగం

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు పూర్తి

రాజానగరం, జనవరి 3: లోక కల్యాణం, విశ్వశాంతి కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)ఆధ్వర్యంలో గైట్ కళాశాల ప్రాంగణంలో గురువారం నుంచి చతుర్వేద మహాయాగం ప్రారంభమవుతున్నట్టు చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) బుధవారం తెలిపారు. 4వ నుంచి 8వ తేదీ వరకు వేద మంత్రోచ్చరణతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. చతుర్వేదాల్లోని విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అందించాలనేదే యాగం ముఖ్యోద్దేశమన్నారు. యాగశాల ప్రాంగణంలోనే గోశాలతో పాటు మన రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ నమూనా ఆలయాలు, ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయా దేవస్థానాల అర్చకులు, వేద పండితులతో ఆశీర్వచనం, ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

నిత్య పూజలు...

శ్రీవారి వైభవోత్సవంలో భాగంగా నేటి నుంచి తిరుపతిలో నిత్యం జరిగే మాదిరిగా ఐదు రోజులపాటు స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, కొలువు, సహస్రనామార్చన, పంచాంగం శ్రవణం, నివేదనం, శుక్రవారాభిషేకం, తిరుప్పావ సేవ, శ్రీవారి కల్యాణోత్సవం, గురుడసేవ, ఏకాంతసేవ, నివేదన కైంకర్యాలను వేద పండితులు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గైట్ ప్రాంగణంలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ తెలుగు మహా సభల నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్టు చైతన్యరాజు తెలిపారు. శ్రీరాజరాజ నరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహా భారతం వెయ్యేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగే మహాసభలకు గైట్ ప్రాంగణంలో మూడు వేదికలు సిద్ధం చేశామన్నారు. ఐదు రాష్ట్రాలకు సంబంధించిన గవర్నర్లు, కేంద్ర మంత్రులు, పలువురు న్యాయమూర్తులు, సినీరంగ ప్రముఖులు హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైతన్యరాజు పిలుపునిచ్చారు.



సిద్ధమవుతున్న వేదిక

పవన్ పర్యటన వాయిదా

కాకినాడ సిటీ, జనవరి 3: ఈ నెల 4, 5 తేదీల్లో జరగాల్సిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కాకినాడ పర్యటన వాయిదా పడింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ సమీక్షల నేపథ్యంలో ఇక్కడి మలి విడత పర్యటన వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మూడురోజులు పవన్‌కల్యాణ్ కాకినాడలో బస చేసి పార్టీ నాయకులతో సమీక్షలు జరిపారు. ఆ సమయంలోనే 4, 5 తేదీల్లో కాకినాడలో పర్యటిస్తారని ప్రచారం జరిగింది. తదుపరి ఎప్పుడు పవన్ పర్యటన ఉంటుందనేది టూర్ ఖరారైన తర్వాత వెల్లడిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న శివరామసుబ్రహ్మణ్యం

ఆత్రేయపురం, జనవరి 3: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వాడపల్లి శ్రీ వేంకటేశ్వర వాసవి నిత్యాన్నదాన ట్రస్టు తరపున చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణం రూ.10 లక్షలు విరాళాన్ని బుధవారం సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

వేధింపులకు రాలిన విద్యా కుసుమం

గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



పెదపూడి, జనవరి 3: ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలకు చేరి తన కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న విద్యా కుసుమం అంతలోనే నేలరాలింది. నూరేళ్ల బంగారు భవిష్యత్ వేధింపుల కారణంగా అర్థాంతరంగా ముగిసింది. పెదపూడి మండలం అచ్యుతాపురత్రయానికి చెందిన వప్పు పోసి మణికంఠ (19) మృత్యువుతో పోరాడి మృతిచెందాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి మణికంఠ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మణికంఠ కాకినాడ జిల్లాలోని ఓ ప్రముఖ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పుడు మాదిరిగానే గత నెల 27న కళాశాల బస్సులో కళాశాలకు వెళ్లాడు. వేధింపులే నిత్యకృత్యంగా మారిన కళాశాల హెచ్‌ఓడీ, మరో ఇద్దరు లెక్చరర్లు మణికంఠను చొక్కాకు బటన్స్ సరిగా పెట్టలేదన్న నెపంతో దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మణికంఠ చనిపోవాలని ఆదేరోజు సాయంత్రం సుమారు 6.15 నిమిషాల సమయంలో మాధవపట్నం సమీపంలోని ఇన్‌కంట్యాక్స్ కాలనీ వద్ద గడ్డిమందు తాగి తన కుటుంబ సభ్యులకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఆగమేఘాలమీద కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి మెరుగైన చికిత్సకు ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మణికంఠ తుదిశ్వాస విడిచాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. మణికంఠ మరణవార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ ఇంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయాడని మృతుని తల్లి, తోబుట్టువులు విలపిస్తున్న తీరు అందరిని కలచివేసింది.

ఐటీడీఏ కార్యాలయం ముట్టడి

చింతూరు, జనవరి 3: జగన్ ప్రభుత్వంపై అంగన్వాడీలు మండిపడ్డారు. గత ఇరవై రెండు రోజులుగా తాము సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వారు వాపోయారు. తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో మాత్రం మొండి చేయి చూపుతోందన్నారు. బుధవారం చింతూరు ఐటీడీఏను అంగన్‌వాడీలు ముట్టుడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగడం హేయనీయమన్నారు. ప్రభుత్వం బెదిరింపులకు తాము భయపడేది లేదని అన్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామన్నారు. తమకు నెలకు జీతం రూ.26 వేలు, ఇతర అలవెన్సులు చెల్లించే వరకు తమ నిరసన, సమ్మె కొనసాగుతుందన్నారు. చివరిగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయ, చిట్టెమ్మ, కిట్టమ్మ, నూకరత్నం, వెంకటరమణ, సత్యవతి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

హోంమంత్రిని కలిసిన ఐజీ



హోం మంత్రికి ఐజీ అశోక్‌కుమార్ శుభాకాంక్షలు

కొవ్వూరు, జనవరి 3: హోం మంత్రి తానేటి వనితను ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు రేంజ్ డీఐజీగా పనిచేస్తూ ఐజీగా పదోన్నతి పొందిన అశోక్‌కుమార్ బుధవారం కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో హోం మంత్రిని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ జగదీష్ ఉన్నారు.



సీతారాముల రథానికి స్వాగతం పలుకుతున్న దేవస్థానం అధికారులు

అయోధ్యకు రత్నగిరి మట్టి, నీరు

అన్నవరం నమూనాలయానికి వచ్చిన అయోధ్య రామరథం

అన్నవరం, జనవరి 3: ఈనెలలో అయోధ్య రామాలయ ప్రారంభం వేడుకలలో సత్యదేవుడు కొలువుదీరిన రత్నగిరి మట్టిని, పవిత్ర పంపానీటిని దేవస్థానం అధికారులు అందజేశారు. మంగళవారం రాత్రి 12 గంటలకు జాతీయ రహదారిపై నమూనాలయానికి చేరుకున్న అయోధ్య రామ రథానికి దేవస్థానం పీఆర్వో దామెర కృష్ణారావు, పండితులు ఘన స్వాగతం పలికారు. రాజస్థాన్‌లో బికనూరు నుంచి డిసెంబరు 18న రామరథం బయలుదేరిందని, ఈనెల 22 నాటికి అయోధ్య రామ మందిరానికి చేరుతుందన్నారు. రాష్ట్రంలో అన్నవరం, విజయవాడ దేవస్థానాల నుంచి నీరు, మట్టిని తీసుకెళుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న మోటార్ బైక్

సర్వేయర్ మృతి, మరో సర్వేయర్‌కు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, జనవరి 3: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామం వద్ద బుధవారం రాత్రి మోటార్‌బైక్ చెట్టును ఢీకొన్న దుర్ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏలేశ్వరం మండలం సర్వేయర్లుగా పని చేస్తున్న ఏలేశ్వరానికి చెందిన మురళి, సిరిపురం గ్రామానికి చెందిన స్వామిసతీష్ బుధవారం రాత్రి పెద్దిపాలెంలో ఒక శుభకార్యానికి హాజరై తిరిగి మోటార్‌బైక్‌పై వస్తుండగా లంపకలోవ గ్రామం వద్ద వారు నడుపుతున్న బైక్ చెట్టును ఢీకొంది. ఈ దుర్ఘటనలో మురళీ (26) అక్కడికక్కడే మృతి చెందగా స్వామి సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాపత్రికి 108 వాహనంలో తరలించారు. ఇద్దరు యువకులు సర్వేయరుగా పని చేస్తూ ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందడం, మరొకరు తీవ్రంగా గాయపడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



మురళీ మృతదేహం

చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించలేని మంత్రి, ఎమ్మెల్యే

సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన నాగాబత్తుల శాంతకుమారి

అంబాజీపేట, జనవరి 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20 వేలు పైబడి ఉన్న మాచవరం మేజర్ పంచాయతీలో ఏడాది కాలంగా చెత్త డంపింగ్ సమస్య ఉన్నప్పటికీ తమ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగిన రాష్ట్రస్థాయి సర్పంచ్‌ల సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో శాంతకుమారి పాల్గొని మాచవరంలో నెలకొన్న చెత్త డంపింగ్ సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా ఉండి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేని దుస్థితిలో సర్పంచ్‌లు ఉన్నారన్నారు. ఈ సదస్సులో పలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు శాంతకుమారి ఆంధ్రజ్యోతికి తెలిపారు.



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

6న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల తొలి సమావేశం

అంతర్వేది, జనవరి 3: మాఘమాసంలో ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణోత్సవాల మొదటి సమావేశాన్ని అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 6న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సమక్షంలో జరుగుతుందని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. సమావేశానికి వివిధశాఖల అధికారులు హాజరుకావాలని ఏసీ కోరారు. 4న స్వామివారి హుండీ ఆదాయం లెక్కిస్తామని ఆయన తెలిపారు.

నిమ్నవర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే

అమలాపురం రూరల్, జనవరి 3: జిల్లా వ్యాప్తంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నిమ్నవర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. అలాగే బండారులంకలోని కాంగ్రెస్‌పార్టీ జిల్లా శాఖ కార్యాలయంలో సావిత్రి జిల్లాశాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు అయితా బత్తుల సుభాషిణి, ఎం.శివన్నారాయణ, నాయకులు వడ్డి నాగేశ్వర రావు, కుడుపూడి శ్రీనివాస్, గంటి ప్రవీణ్‌కుమార్, గోడి భాస్కరరావు, పోలిశెట్టి హరిబాబు, వంటెద్దు బాబి, రాయు డు వెంకటరమణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముమ్మిడివరం పోలమ్మ చెరువుగట్టున ఉన్న జైబుద్ధ పార్కులో వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుబ్బల రవి, కాశి సత్యనారాయణమూర్తి, దోనిపాటి ఆంజనేయులు, గోడి భాస్కరరావు, ముషిణి శివప్రసాద్, అయినవిల్లి వలియా, కాశి అచ్యుతరామయ్య, పలివెల నరేష్, గోనమండ వెంకటేశ్వరరావులతోపాటు పలువురు పాల్గొన్నారు. తిల్లమ్మ చెరువుగట్టున పీపుల్ సర్వీసు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని ఘనం గా జరిపారు. ప్రాథమిక పాఠశాలలో కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు.

రామచంద్రపురం: రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ ఆధ్వర్యంలో స్థానిక పెట్రోల్ బంకు ఎదురుగాగల సత్యజయ కాంప్లెక్స్ వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యండ్ర బుల్లబ్బులు, టేకుమూడి సత్యన్నారాయణ, కట్టా సూర్యనారాయణ, అడ్వకేట్ ఎం.వి.సుబ్బారావు, కాజా జగన్నాధం, ముంగండ భాస్కరరావు, ఎం.వెంకట్రావు, పిల్లి గణపతి, పి.దుర్గాపవన్ కుమార్, మాలయ్య పాల్గొన్నారు. స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో వికాస్ విద్యా సంస్థల కరెస్పాండెంట్ వాసంశెట్టి వెంకటరమణ, ప్రిన్సిపాల్ వి.ఝాన్సీ, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.సిద్ధూ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు లంక రాణి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కేఎస్‌వీఎస్ లక్ష్మి మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

మామిడికుదురు: స్థానిక బాలుర వసతిగృహంవద్ద గల సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలే సామాజిక చైతన్య వేదిక టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈలి శ్రీనివాస్, వాసంశెట్టి శంకరరావు, జనసేన నాయకులు ఈలి రాంబాబు, మట్టా సత్తిబాబు, యింటి మహేంద్ర, కాట్రేనిపాడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ముంగండ హైస్కూల్లో భారతదేశ ప్రథమ మహిళ ఉపాధ్యాయరాలు సాయిత్రీబాయిపూలే జయంతి వేడుకలను ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయని జి.కనకదుర్గతోపాటు మహిళా ఉపాధ్యాయులు సాయిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలు రాణికనకదుర్గను ఘనంగా సన్మానించారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సాయిత్రీబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాలలో ఎస్టీయూ మండలశాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబాజీపేట: సావిత్రీబాయి జయంతి సందర్భంగా అంబాజీపేట, తొండవరం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీఎంవో సుబ్రహ్మణ్యం హెచ్ఎంలు కడలి సాయిరామ్, పి.వి.కేశవచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: మైనార్టీ బీసీ సంఘం ఆధ్వర్యంలో జ్యోతీరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యాట్ల నాగేశ్వరరావు, వీరభద్రరావు, మాజీ సర్పంచ్ యాట్ల చినఅప్పారావు, వేమవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో ఎస్టీయూ సంఘ అధ్యక్షుడు ఆర్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు యల్లమిల్లి ప్రసాద్, గెల్లి విశ్వనాథగుప్తా, జి.మధుసారధి తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


ముమ్మిడివరం: సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


అమలాపురం: బండారులంకలో నివాళులర్పిస్తున్న కామన ప్రభాకరరావు

టీడీపీలో చేరనున్న ప్రఖ్యాత రేడియాలజిస్టు 'కాద'



ద్రాక్షారామ, జనవరి 3: ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో పేరు గాంచిన ప్రఖ్యాత రేడియాలజిస్టు, కాకినాడ సత్యస్కాన్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ కాద వెంకటరమణ టీడీపీలో చేరనున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం మండలం పామర్రుకు చెందిన డాక్టర్ కాద వెంకటరమణ కాకినాడలో సత్యస్కాన్ స్థాపించి రేడియాలజీ నిపుణుడిగా గుర్తింపు దక్కించుకున్నారు. డా.వెంకటరమణ టీడీపీలో చేరేందుకుగాను ఇప్పటికే రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యంను కలసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలో ప్రముఖులను కలుస్తున్నారు. చంద్రబాబు జిల్లాల పర్యటన సందర్భంగా డాక్టర్ కాద వెంకటరమణ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరే అవకాశాలు ఉన్నాయి.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన వార్డు సభ్యుడు


బండారు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన చింతలూరు పంచాయతీ వార్డు సభ్యుడు

కొత్తపేట, జనవరి 3: మండలంలోని చింతలూరు పంచాయతీ వార్డు సభ్యుడు చింతలూరు సత్యకృష్ణ రవిఫణీంద్రకుమార్ వార్డు సభ్యత్వానికి, వైసీపీకి రాజీనామా చేసి బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో తన వర్గంతో కలిసి ఆ పార్టీలో టీడీపీలో చేరారు. వారికి సత్యానందరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వెలవెలపల్లి వంశీ, వెలవెలపల్లి ఫణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపేగు కేన్సర్‌పై పరిశోధనకు డాక్టరేట్


ఆకెళ్ల సుబ్రహ్మణ్యనరసింహరాజు

అమలాపురంటౌన్, జనవరి 3: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీని వినియోగించుకుని పెద్దపేగు కేన్సర్‌పై పరిశోధనలు చేసిన అమలాపురం పట్టణానికి చెందిన ఆకెళ్ల సుబ్రహ్మణ్య నరసింహరాజుకు చెన్నై ఎస్ఆర్ఎం కట్టంకలత్తూర్ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మూడేళ్ల ఐదు నెలల పాటు ఈ పరిశోధన సాగించగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటేష్ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈయన హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన నరసింహరాజును ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్వీ నరసింహ ప్రసాద్, విభాగాధిపతి డాక్టర్ సుచరితరెడ్డి అభినందించారు.

ఎస్టీయూ వజ్రోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఆత్రేయపురం, జనవరి 3: ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల పోస్టర్‌ను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్ బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 12,13 తేదీల్లో కర్నూలులో జరగనున్న ఎస్టీయూ 75 సంవత్సరాల వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను, క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. సోమశేఖర్, దొరబాబు, మాణిక్యాలరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, జనవరి 3: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ల ద్వారా ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి టి.లోకమాన్ బుధవారం తెలిపారు. స్కిల్ హబ్‌ల ద్వారా ప్రతీ నియోజకవర్గంలో శిక్షణ నిర్వహించి అనంతరం ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. స్థానిక పరిశ్రమల సహకారంతో ప్రస్తుతం ఉన్న నూతన సాంకేతికాలను ఉపయోగించి పరిశ్రమ నైపుణ్యత ఉపాధ్యాయులచేత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. జిల్లాలోని ఫేజ్-2కు సంబంధించి రామచంద్రపురం నియోజకవర్గానికి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రఘువర్మ, సెల్ 9948404165ను సంప్రదించాలని లోకమాన్ తెలిపారు.

కొనసాగుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం, జనవరి 3: ముమ్మిడివరం నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారంనాటికి 9వ రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు దీక్షలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు కూడా బుధవారం నుంచి సమ్మెకు దిగారు వీరు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సావిత్రీబాయి చిత్రపటానికి వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, ఉమ్మడి జిల్లా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎ.సత్తిబాబు, శీలం వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు జనిపల్లి సత్యనారాయణ, పలివెల రాంబాబులతో పాటు పలువురు శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటేష్, కాకి రాంబాబు, బి.లోవరాజు, ఎం.భార్గవ్, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, కుమార్, సతీష్, ఎస్.రామరాజు, బి.శ్రీను, నాగమణి, ఎస్.బొజ్జమ్మ, బి.రమణమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

యానాంలో..


ఆర్‌పి మునిస్వామికి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

యానాం, జనవరి 3: యానాం నియోజవర్గంలోని ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కారం కోరుతూ విధులను బహిష్కరించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా యానాం కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఆర్థాని దినేష్, పొసియ్య తమ మద్దతును తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సిబ్బంది జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

డీజిల్ అక్రమంగా తరలిస్తున్న ట్యాంకరు సీజ్



ముమ్మిడివరం, జనవరి 3: యానాం నుంచి డీజిలును అక్రమంగా తరలిస్తున్న ట్యాంకరును ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన ట్యాంకరులో డీజిలును యానాం నుంచి ఆత్రేయపురం తరలిస్తుండగా బుధవారంరాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రైనీ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, ఎస్ఐ ఎస్.శివప్రసాద్ ముమ్మిడివరం బైపాస్‌లో పట్టుకున్నారు. ట్యాంకరుతోపాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సివిల్ సప్లయిస్ అధికారుల సమక్షంలో ట్యాంకరును సీజ్ చేశారు. సుమారు రెండు వేల లీటర్ల డీజిలు ఉన్నట్టు అంచనా వేశారు.

రామచంద్రపురంలో సీను మారింది

● అధికార కార్యక్రమాల్లో ఎంపీ బోస్, ఇన్‌చార్జి సూర్యప్రకాష్

ద్రాక్షారామ, జనవరి3: రామచంద్రపురం నియోజకవర్గంలో అధికారపార్టీ వైసీపీ ఇన్‌చార్జి మార్పుతో అధికార కార్యక్రమాల్లో మార్పులు మొదలయ్యాయి. రామచంద్రపురం నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపీ బోస్ చిన్నకుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌ను అధిష్టానం నియమించిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు అధికార పార్టీ కార్యక్రమాల్లో ముఖ్యంగా ప్రారంభోత్సవాల్లో దూరంగా ఉన్న ఎంపీ బోస్ నియోజకవర్గంలో అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలో రూ.25 లక్షలు ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్న శెట్టిబలిజ సామాజిక భవనం నిర్మాణానికి బుధవారం ఎంపీ బోస్ ఆయన కుమారుడు వైసీపీ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్‌లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి తుకారాం, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు దొంగ శ్రీధర్, మాజీ సర్పంచ్ గెద్దాడ సుబ్రహ్మణ్యం, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ, ఎంపీడీవోలతో సమావేశం

గురువారం ఎంపీ బోస్ రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలో కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్ అండ్‌ఆర్డీలతో సమావేశం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

వృత్తివిద్యా నైపుణ్యంపై శిక్షణ

రావులపాలెం, జనవరి 3: రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వృత్తివిద్యా నైపుణ్యం పెంచే విధంగా శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం సుబ్బరాజు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఆటోమొబైల్ కోర్సు ఏర్పాటు చేశామన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుడు పడాల జాన్‌కుమార్‌ను నియమించామని చెప్పారు. ఆటోమొబైల్ కోర్సు శిక్షణలో భాగంగా 9వ తరగతి విద్యార్థులను టీవీఎస్ షోరూమ్‌కు తీసుకెళ్లి ప్రాక్టికల్స్ చేయించారు.

9 వరకు దరఖాస్తుల పరిశీలన

పి.గన్నవరం, జనవరి 3: ఈనెల 9వ తేదీ వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ దరఖాస్తులు పరిశీలిస్తామని తహసీల్దార్ జీఆర్ ఠాగూర్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. నియోజకవర్గంలో గతేడాది అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు ఫారమ్-6లకు సంబంధించి 5532 దరఖాస్తులు స్వీకరించగా 421 తిరస్కరించి 5,110 పరిష్కరించామన్నారు. ఫారమ్-7కు సంబంధించి 4,290 దరఖాస్తులు స్వీకరించి 181 తిరస్కరించి 4088 దరఖాస్తులు పరిష్కరిస్తామన్నారు. ఫారమ్-8కు సంబంధించి 2,352 దరఖాస్తులు స్వీకరించి 2,182 పరిష్కరించామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

కోటిపల్లి సోమేశ్వరుని హుండీ ఆదాయం రూ.2,87,715

కె.గంగవరం, జనవరి3: కోటిపల్లి శ్రీ ఛాయాసోమేశ్వర స్వామివారి హుండీ ఆదాయం రూ. 2,87,715లు వచ్చింది. గత సంవత్సరం ఫిబ్రవరి20 నుంచి నేటివరకూ హుండీల ద్వారా వచ్చిన ఆదాయం లెక్కించినట్లు ఈవో శ్రీదేవి చెప్పారు. ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆచంట నియోజకవర్గ టీడీపీ పరిశీలకునిగా రుద్రరాజు



మలికిపురం, జనవరి 3: రాజోలు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిమూలకు చెందిన రుద్రరాజు వెంకట్రామరాజును పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ టీడీపీ పరిశీలకునిగా నియమిస్తూ రాష్ట్ర టీడీపీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకట్రామరాజు తూర్పు గోదావరిజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించారు. ఈ సందర్భంగా వెంకట్రామరాజు విలేఖరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అనూహ్య విజయం సాధిస్తుందన్నారు. వెంకట్రామరాజును టీడీపీ నాయకులు అభినందించారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జనవరి 3: మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు దాతలు విరాళాలు అందించారు. మురమళ్లకు చెందిన గోకవరపు అన్నపూర్ణ, కాకినాడకు చెందిన క్రాంతికుమార్ దంపతులు రూ.పది వేలు వంతున బుధవారం విరాళాలు సమర్పించారు. దాతలను ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతలను సన్మానించారు.

అటుకుల మిల్లు బెల్టులో చెయ్యి పడి తీవ్రగాయాలు

అల్లవరం, జనవరి 3: మండలంలోని గోడి గ్రామానికి చెందిన నాని కొమరగిరిపట్నంలోని విత్తనాల మాస్టారు అటుకుల మిల్లుబెల్టులో రెండు నెలలుగా పనిచేస్తున్నాడు. బుధవారం బెల్టులో ప్రమాదవశాత్తూ చేయి పడి అతడు తీవ్రంగా గాయపడ్డాడు. తనకు వైద్య ఖర్చులకు రూ.1000 ఇచ్చి యజమాని చేతులు దులుపుకున్నాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నానిని అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలందిస్తున్నారు. కేసు నమోదు చేసినట్టు అల్లవరం పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై దాడికి నిరసన

ఆత్రేయపురం, జనవరి 3: ఆత్రేయపురం పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు సత్యనారాయణ, సాయిరామ్ విధి నిర్వహణలో ఉండగా కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో నాతి బుజ్జికి వినతిపత్రం అందజేశారు.

ఆలమూరులో న్యాయదులు రిలే దీక్షలు

ఆలమూరు, జనవరి 3: రాష్ట్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలమూరులో న్యాయవాదులు బుధవారం రిలే దీక్షలో కూర్చున్నారు. ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలాది వీర వెంకటసత్యనారాయణమూర్తి సమక్షంలో న్యాయవాదులు ఎం.మహేశ్వర్లు, ఎస్.సత్యనారాయణ, జి.రాజశేఖర్, వి.విద్యాప్రసన్న, విత్తనాల సత్యనారాయణ, కె.సునీల్‌కుమార్, జొన్నపల్లి సత్యనారాయణ, టీవీ గోవిందరాజు, ధనరాజు దీక్షలో పాల్గొని చట్టానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారికి పలువురు సంఘీ భావం తెలిపారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

కపిలేశ్వరపురం, జనవరి 3: మండలంలోని కోరుమిల్లి పంచాయతీ కార్యాలయంవద్ద బుధవారం ఈవీఎంల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవీఎం మిషన్ వినియోగించి ఓటు ఏవిధంగా వేయాలి, పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఏవిధంగా ఓటు నమోదు చేసుకోవాలి, తదితర అంశాలపై వీఆర్వో ఎ.మల్లేష్ ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, తదితరులుపాల్గొన్నారు.

'రైతు సంఘ రాష్ట్ర సభలు విజయవంతం చేయండి'

మలికిపురం, జనవరి 3: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వం రైతులకు సబ్సిడీని తగ్గించడం, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోవడంవల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అన్నారు. బుధవారం మలికిపురంలో జరిగిన సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం చర్చించి భవిష్యత్తు కార్యాచరణను పరిష్కారం కోసం ఈ నెల 8, 9, 10 తేదీల్లో రాజమహేంద్రవరంలో రాష్ట్ర రైతు సంఘం సభలో జరుపుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులు తరలి రావాలన్నారు. పిచ్చిక గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజోలు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి దేవరాజేంద్రప్రసాద్, కార్యదర్శి నివేది కను ప్రవేశపెట్టారు. సమావేశంలో జంపన ప్రసాదరావు, కొండా సత్తిబాబు, చెల్లుబోయిన తాతారావు, నల్లి బుజ్జిబాబు, మేడిచర్ల సత్యనారాయణ, దీపాటి గంగాజలం పాల్గొన్నారు.

వసతిగృహాలకు ఎల్ఈడీ టీవీలు అందజేత

ముమ్మిడివరం, జనవరి 3: ముమ్మిడివరం పట్టణ పరిధిలో గల ప్రభుత్వ వసతిగృహాలకు దాతల సహాయంతో ఆరు ఆండ్రాయిడ్ టీవీలను పంపిణీ చేశారు. గురుకుల పాఠశాలకు ముమ్మిడివరం రెవెన్యూ సిబ్బంది ఒక టీవీని, బాలు, కళాశాల బాలికల వసతి గృహానికి ముమ్మిడివరం మర్చంట్ అసోసియేషన్‌వారు రెండు టీవీలను, హైస్కూలు బాలికల వసతిగృహానికి జనతా క్లినిక్ వైద్యుడు ఎస్.జగన్మోహన్ ఒక టీవీని, బాలుర హైస్కూలు వతిసగృహానికి మెప్మా సిబ్బంది ఒక టీవీని, ఎస్సీ బాలుర వసతి గృహానికి కేవీడీ రమేష్ ఒక టీవీని బహూకరించారు. వీటిని ఆయా వసతిగృహాలకు బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో అందజేశారు. కార్యక్రమంలో పెన్మెత్స చిట్టిరాజు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, కమిషనర్ జి.లోవరాజు, వైస్‌చైర్మన్ వి.బోసురాజు, రెడ్డి శిన్నారాయణ, రెడ్డి హేమసుందరి, బొంతు సత్యశ్రీనివాస్, కాండ్రేగుల త్రిమూర్తులు, ఆయా వసతిగృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

మాచవరంలో గడప గడపకు మనప్రభుత్వం

రాయవరం, జనవరి 3: మండలంలోని మాచవరం గ్రామంలో బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్సీ నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: హాయ్ నాన్న
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: బబుల్‌గమ్
శేఖర్ స్క్రీన్-1	: సలార్
శేఖర్ స్క్రీన్-2	: డంకీ
రమా	: డెవిల్
గణపతి	: యానిమల్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

రేవు శ్రీనుకు పరామర్శ

కె.గంగవరం, జనవరి3: మాతృ వియోగంతో బాధపడుతున్న కోటిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రేవు శ్రీనును రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. తన సానుభూతిని తెలి యజేశారు. జనసేన, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పోలిశెట్టి చంద్రశేఖర్, రెడ్డి సుబ్రహ్మణ్యం శ్రీనును పరామర్శించారు.

యానాంలో కేంద్ర మంత్రుల పర్యటన


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల చెక్కులను అందజేస్తున్న కేంద్రమంత్రులు

యానాం, జనవరి 3: యానాం నియోజవర్గంలో కేంద్రమంత్రులు పర్యటించారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా కేంద్రమత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పర్షోత్తమ్‌రుపాలా, సహాయమంత్రి ఎల్.మురుగన్‌ల బృందం బుధవారం యానాంలో పర్యటించారు. స్థానిక ప్రభుత్వ అతిథిగృహంవద్ద ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌పి మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, యానాం బీజేపీ శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా పుదుచ్చేరి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సావిత్రినగర్‌లో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్ఎఫ్‌డీబీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వీరు పాల్గొన్నారు. అక్కడ ఉన్న మత్స్యకారులతో మాట్లాడి వారు సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక మత్స్యకారులు, ఆక్వారైతు ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రమంత్రులకు వివరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మట్లాడారు. మత్స్యకారుల సంక్షేమంకోసం భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక కార్పొరేషన్‌ను తీసుకువచ్చి తద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా అర్హులైన పలువురి లబ్ధిదారులకు ఆయా బ్యాంకుల ద్వారా చెక్కులను కేంద్రమంత్రులు అందజేశారు. అయితే నాలుగు గంటల్లో యానాం పర్యటన ముగించుకుని కాకినాడ బయలుదేరి వెళ్లారు. మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి నీతుకుమారి ప్రసాద్, జయశ్రీ, ఎన్ఎఫ్‌డీబీ సీఈఓ డాక్టర్‌ఎల్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

మానసిక రోగ పరిస్థితి నయం

● చికిత్స చేయించిన మండల లీగల్ సర్వీసెస్ కమిటీ



ముమ్మిడివరం, జనవరి 3: మానసిక రోగికి విశాఖ ఆసుపత్రిలో వైద్య సేవలు చేయించి అతని ఆరోగ్య పరిస్థితిని ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నయం చేయించింది. ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన చెయ్యేటి వెంకట్రావు పిచ్చివాడిగా ప్రవర్తిస్తూ భార్యా పిల్లలను ఇష్టం వచ్చినట్టు కొడుతూ చుట్టుపక్కల వారితో గొడవ పడుతూ చేతికి దొరికిన వస్తువులతో కొట్టి గాయ పరుస్తూ ఉండేవాడు. ఈ విషయం ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహంతుల్లా దృష్టికి రావడంతో ఆయన ఐ.పోలవరం పోలీసులను అప్రమత్తం చేసి వెంకట్రావును రప్పించి ముమ్మిడివరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు పంపించ గా వైద్యులు వైద్య పరీక్షలుచేసి మానసిక స్థితి సక్రమంగా లేనట్టు ధ్రువీకరించారు. దీంతో అతనిని వైద్య సేవలకోసం విశాఖపట్నం గవర్న మెంట్ హాస్పిటల్ ఫర్ హెల్త్‌కేర్‌కు పంపించారు. అక్కడ వారు వైద్యం చేస్తూ అతని ప్రతీనెల మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో జూనియర్ జడ్జికి నివేదిక పంపేవారు. వెంకట్రావు మానసిక స్థితి మెరుగుపడిన తరువాత వారు ధ్రువీకరణ చేసి పంపించారు. దీంతో వెంకట్రావు కుటుంబ సభ్యులను, వెంకట్రావును ఐ.పోలవరం పోలీసులు ముమ్మిడి వరం జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరుచగా అతని మానసిక పరిస్థితిని పరిశీలించి బాగానే ఉందని గు ర్తించారు. వెంకట్రావు కుటుంబ సభ్యులు జూనియర్ సివిల్ జడ్జికి కృతజ్ఞతలు తెలిపారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

అల్లవరం, జనవరి 3: మండలంలోని తాడికోన, తూర్పులంక, రెల్లుగడ్డ, గ్రామాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలు జరిగాయి. 13 మందికి గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. సర్పంచ్‌లు కడలి గంగాచలం, ఎస్వీపీ సత్యనారాయణరాజు (వాసురాజు), ఈవోపీఆర్డీ ఎస్.సత్యనారాయణమూర్తి, ఏవో ఎస్వీపీ సత్యనారాయణ, ఏపీఎం సయ్యద్ హుస్సేన్, బొంతు రాజు, ఎస్‌బీఐ మేనేజరు, పోస్టల్ అధికారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి

పి.గన్నవరం: ప్రధాని మోదీ ఆధ్వర్యంలోనే దేశం అన్నిరంగాలలో అభివృద్ధి చెందిందని బీజేపీ నాయకులు అన్నారు. పి.గన్న వరం సెంటర్‌లో షాపులకు మన సంకల్పం అభివృద్ధి చెందిన భారత్ పేరుతో ముద్రించిన క్యాలెండర్లు, పుస్తకాలను అందించి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, ఆరుమిల్లి వీరభద్రం, చికరమిల్లి శ్రీనివాసరావు, కోలా గోపి, యర్రంశెట్టి సాయిబాబు, పాటి సత్యనారాయణ, దిగుమర్తి ఏడుకొండలు, ఐ.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సభలు

కె.గంగవరం, జనవరి3: మండలంలోని పాణింగపల్లి, గంగవరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు చీకట్ల సునీత గోపాలం, కోటి లక్ష్మీనరసమ్మ వెంకట్రావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, తహసీల్దార్ టి.వైద్యనాధ్‌శర్మ, ఏవో బలుసు రవి, భారతీయ జనతా పార్టీ నాయకులు సలాది శేఖర్, దూడల శంకరనారాయణ, కేశవ రాఘవేంద్ర, సలాది రామకృష్ణ, కాదా వీరవెంకటరమణ, సలాది సురేష్ పాల్గొన్నారు.

ధనుర్మాస లక్ష తులసి పూజ

అమలాపురం టౌన్, జనవరి 3: పట్టణంలోని శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం దేవతిలకుల భక్త బృందం ఆధ్వర్యంలో ధనుర్మాస లక్ష చామంతి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి వేంకటసత్యనారా యణాచార్యులు, శ్రీనివాసుల విజయగోపాలాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. హోమం జరిపించి పూర్ణాహుతి చేశారు. శాంతి కల్యాణం నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది. దేవస్థానం చైర్మన్ దూడల వీరీతాదేవి, దేవతిలకుల భక్త బృందం, దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

అమలాపురం టౌన్, జనవరి 3: ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ముస్లిం వీధిలోని హజరత్ ఖ్వాజాబాబా దర్గా వద్ద బుధవారం ఇమామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు పంచారు. జనసేన అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు, భక్తులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ అమీర్, ఎండీ బషీర్, బాషాజాన్, షరీఫ్, ఎస్కే. కరీముల్లాబాబా, షఫీ, లింగోలు పండు, నాగమానస, ఆర్డీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటా అక్షింతలు పంపిణీ

యానాం, జనవరి 3: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నిర్వహిస్తున్న నేపథ్యంలో శ్రీరామమందిరం ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరామ మందిర చిత్రం, ఆహ్వాన కరపత్రం, అంక్షింతలనుఇంటింటా పంపిణీ చేశారు. బుధవారం మెట్టకుర్రువార్డు పరిధిలోని రామన్నకోడులో పంపిణీ చేశారు.

స్వప్రయోజనమే లక్ష్యంగా వైసీపీ పాలన

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు ధ్వజం

ఆలమూరు, జనవరి 3: గత నాలుగేళ్లగా ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి స్వప్రయోజనమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగిస్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ధ్వజమెత్తారు. వైసీపీ పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. మండలంలోని సందిపూడిలో బుధవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో జరిగింది. స్థానికంగా ఉన్న పలు సమస్యలను ప్రజలు ఆయనకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమితో రాష్ట్రంలో మంచి పాలన రానున్నదని చెప్పారు. కార్యక్రమంలో సందిపూడి సర్పంచ్ తోట భవానీవెంకటేశ్వర్లు, తోలేటి సంతోషి, నాయకులు దొడ్డా సుబ్బారావు, పామర్తి ఆంజనేయులు, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, సలాది నాగేశ్వరరావు, వాసా కాశీ, ఈదల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ


ఇప్పనపాడులో బాబుష్యూరిటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జనవరి 3: మండలంలోని ఇప్పనపాడులో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రప్రజలు వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఎప్పుడు గద్దెదించుదామని ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ జనసేన నాయకులు కుంచేప్రసాద్, యిర్రోతు శేఖర్, చోడే పాపారావు, ఇళ్లగంగరాజు, ఆనంద్, గుత్తుల చంద్రరావు, నక్కు వెంకటరమణ, చిన్న పాల్గొన్నారు.

నేడు రాయవరంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం

రాయవరం, జనవరి 3: రాయవరం గ్రామంలో ఈనెల 4న బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని ఇంటింటికీ పర్యటిస్తారని టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో 4, 5తేదీల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

చంద్రబాబును సీఎంను చేద్దాం: మాజీ ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జనవరి 3: చంద్రబాబును సీఎంను చేద్దాం.. రాష్ట్రాన్ని కాపాడుకుందామని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని వడ్డిగూడెంలో బుధవారం రచ్చబండ సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం అప్పుల పాలుచేసిందని ఆరోపించారు. అనంతరం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, తిక్కిరెడ్డి నేతాజీ, భాస్కర్ల రామకృష్ణ, శెట్టిబత్తుల దిన్నాబాబు, కుంచే వెంకన్నబాబు, వలవల శివరావు, పలివెల శ్రీను, పట్నాల రమణ తదితరులు పాల్గొన్నారు.